## శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడ వరకు తీరప్రాంతం అంతా బడాబాబులకు పందేరం. ప్రజల జీవనోపాధిని హరించే అభివృద్ధిపథకాలు, ప్రాజెక్టులను వ్యతిరేఖిద్దాం !



మా ప్రాంతం కూడా అభివృద్ధి అయిందండి, అభివృద్ధి కింద మా పొలాలు కూడా పోయాయి. వలస పోతున్నాం!

**ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, పోర్టులు, కోస్టల్ కారిడార్, పారిశ్రామిక వాడలు, టెక్స్టైల్ పార్కులు, పెట్రో కెమికల్ కారిడార్‌లు, థీమ్ పార్కులు, కెమికల్ కాంప్లెక్స్‌లు, గ్యాస్ ఆధారిత విద్యుత్ పరిశ్రమలు, ఫార్మాపార్కులు, ఇలా అభివృద్ధి పేరుతోఎన్నో ప్రాజెక్టుల స్థాపనకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ పరిశ్రమలు, ప్రాజెక్టుల స్థాపనకు అవసరమయిన భూమిని పేదల వద్ద నుంచి లాక్కొని, వేలకు వేల ఎకరాల భూమిని పారిశ్రామిక వేత్తలకు, మౌలిక సదుపాయాలు, వసతులు అనేక రాయితీలు కల్పించి వారికి ధారాదత్తం చేస్తున్నది.**

ఈ విధంగా భూమిని కోల్పోయిన బడుగు బలహీన, సన్న చిన్న కారు రైతులు, ఆ భూమి కూడా లేనివారు, ఆ భూమి మీద పరోక్షంగా ఆధారపడి జీవించే వ్యవసాయ కూలీలు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి మొదలైన చేతి వృత్తుల వారు, ఆ భూమిలో ఉండే ఈత, తాటి, టెంకాయ చెట్ల నుండి కల్లుగీతే జీవన ఆధారంగా జీవించే గీత కార్మికులు, చేపలుపట్టుకొని, కట్టెలుకొట్టుకొని జీవించే యానాదులు, పంటలేని సమయంలో ఆ భూమి యందు బర్రెలు, మేకలు, గొర్రెలు మొదలగు జంతువులను మేపుకొని తద్వారా జీవనాధారం పొందే గొల్లలు, ఇలా ఆభూముల మీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవించే అనేక లక్షల కుటుంబాలు జీవనాధారాన్ని, నివాసాన్ని కోల్పోతున్నారు.

తీరం వెంబడి కొన్ని వేల మత్స్యకార గ్రామాలున్నాయి, కొన్ని లక్షల మంది మత్స్యకారులు సముద్రం మీద చేపల వేటపై ఆధారపడి జీవించేవారున్నారు. ఇప్పుడు ఆ మత్స్యకార గ్రామాలను అక్కడ నుంచి తొలిగిస్తున్నారు. అనాదిగా సముద్ర తీరప్రాంతంలో నివశిస్తూ, చేపల వేట జీవనాధారంగా జీవించే మత్స్యకారుల జీవితాలలో విషాద చాయలు అలుముకొన్నాయి. ఎక్కడికి వెళ్ళాలో ఏంచేయాలో దిక్కుతొచని స్థితిలో మత్స్యకార ప్రజలు నిరాశ్రయులయ్యారు, వారి జీవన విధానం చిద్రమయింది.

### పోర్టులు :

నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టుకు 2500 ఎకరాల భూమిని సేకరించి అప్పచెప్పారు. తూర్పుతీరంలో ఆ చివర విశాఖపట్నం నుంచి దక్షణాన కృష్ణపట్నం దాకా ఇప్పుడు పోర్టుల సందడి కన్పిస్తుంది. పొడవైన సముద్రతీరం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో నౌకాశ్రయాల నిర్మాణం – అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. ప్రైవేటు రంగంలో పోర్టులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిన తరువాత అనేక సంస్థలు, పోర్టులు నిర్మించేందుకు సిద్దం అయ్యాయి. సరుకు రవాణాలో ఇప్పటి వరకు విశాఖపట్నం పోర్టు దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. సామర్థ్యపరంగా ఇప్పుడుదాన్ని అధిగమించే విధంగా ప్రైవేటు పోర్టులు నిర్మాణం సాగుతుంది. ఇందులో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభం అయిన ఘనత కృష్ణపట్నం పోర్టుది. ఓబూళావారిపాళెం నుంచి కృష్ణపట్నం వరకు రైల్వే లైను నిర్మాణం పూర్తికావస్తుంది. కృష్ణపట్నం వరకు రైల్వే నిర్మాణం పూర్తయి, ఆ తరువాత పోర్టు ఆవరణంలో స్లైడింగ్‌ను ఏర్పాటు చేసే యోచన ఉంది. మొత్తం మీద కృష్ణపట్నం పోర్టులో 41 బెర్తులు, 10,000 కోట్ల పెట్టుబడితో నిర్మించాలని ప్రతిపాదన. కృష్ణపట్నం పోర్టు రెండో దశ నిర్మాణం పూర్తయితే దాదాపు 100 మిలియన్ల టన్నులు సరుకు రవాణా అవుతుందని అంచనా. ఆ తరువాత మరో నాలుగేళ్ళకు 200 మిలియన్ టన్నుల స్థాయికి రవాణా పెరుగుతుందని అంచనా, కొలంబో, చెన్నై వెళ్ళే నౌకలన్నీ కృష్ణపట్నంకు వచ్చే అవకాశం ఉంది.

విశాఖపట్నంలో రెండవదయిన గంగవరం పోర్టు మొదట దశ నిర్మాణం పూర్తికావచ్చింది. "పూర్తి యాంత్రీకరణ" (మనుషులతో పనిలేకుండా) అత్యంత అధునాతన సదుపాయాలతో భారీ నౌకల రాకపోకలకు అనుగుణంగా దీన్ని నిర్మిస్తున్నారు.

కాకినాడలో ఇప్పటికే ఒక నౌకాశ్రయం ఉండగా భీమవరం సమీపంలో, రాష్ట్రానికి చెందిన ఫార్మా యాజమాన్యం, వీడియోకాన్ గ్రూప్‌తో కలసి మరొక పోర్టు నిర్మించనుంది.

మచిలీపట్నంలో మైటాస్ ఇన్‌ఫ్రా నిజాంపట్నం / వాడరేవు (చీరాల)లో మ్యాట్రిక్స్ ఎన్ పోర్ట్స్ నౌకాశ్రయాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పదాలు చేసుకొంటున్నాయి. వచ్చే అయిదు నుంచి పదేళ్ళలో పాక్షికంగా ఇవి నిర్మాణం పూర్తి చేసుకొని సరకు ఎగుమతులకు దిగుమతులకు సిద్దమయ్యే అవకాశం ఉంది.

ఇంతకు ముందు ఇచ్చిన 2500 ఎకరాల భూమికాకుండా "పారిశ్రామిక పార్కు" పేరుతో మరలా 11 వేల ఎకరాల భూమిని కృష్ణపట్నం పోర్టు కంపెనీకి అప్పగించారు. పారిశ్రామిక పార్కు కోసం అంటూ ఇప్పటికే ఎ.పి.ఐ.సి.సి. నుంచి అందిన లేఖ మేరకు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో, కోట మండలంలోని సిద్దవరం, కొత్తపట్నం, కర్లపూడి గ్రామాలు, చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో 5,265 ఎకరాల ప్రభుత్వ భూములను జిల్లా యంత్రాంగం గుర్తించిది. ఇవికాకుండా మరో 6000 ఎకరముల భూమిని గుర్తించి సేకరించాలని ఎ.పి.ఐ.సి.సి. జిల్లా అధికారులను కోరింది. కొత్తగా సేకరించిన భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ తదితర రకాలు వున్నాయి. తొలుత గుర్తించిన 5,265 ఎకరాల భూమిలో 2,683 ఎకరాలను సెప్టెంబరు నెలలోనే ఎ.పి.ఐ.సి.సి. తన అధీనంలోకి తీసుకొంది. పేరుకి ఇది ప్రభుత్వ భూమే అయినా అందులోని చాలా భాగంలో పేదలు – ముంతమామిడి, సరుగుడు చెట్లు పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా వారు ఉపాధి కోల్పోయే ప్రమాదం వుంది. తమ ప్రాంతంలో 6,200 ఎకరముల భూమిని సేకరిస్తున్నారని తెలిసినప్పటి నుండి కోట, చిల్లకూరు మండలాలలోని పలు గ్రామాల పేద రైతులు అందోళన చెందుతున్నారు. తమ ఇష్టాఇష్టాలతో పనిలేకుండా, అధికారులు సర్వేలు నిర్వహించి వారి గ్రామాలలో, గ్రామ సభలు నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోకుండా, ఎందు కోసం భూములు సర్వే జరుపుతున్నారన్నది తెలుపకుండా వారి వద్ద వున్న అసైన్డ్ , డికెటి పట్టాలను పాసు బుక్‌లను , రికార్డులను, సరిహద్దులు పోల్చుకోవాలనే నెపంతో స్వాధీనం చేసుకొన్నారు. దీంతో వారి భూములకు సంబంధించి ఎటువంటి ఆధారములు వారి వద్ద లేకుండా చేశారంటున్నారు. ఇప్పటి వరకు చెట్లు, పుట్ట కొట్టుకొని, భూమిని తీర్చుకొని వ్యవసాయం చేసుకొని జీవిస్తున్న తమ వద్ద నుండి భూములను లాగేసుకొంటే ఏమి చేయాలో తోచని పరిస్థితులలో వారు వున్నారు. సవక, ముంతమామిడి, తాట్టి చెట్లు ఈ గ్రామాల ప్రజలకు జీవనాధారాన్ని కలిగించేవి. వాటిని వారికి లేకుండా చేసారు.

ముందు బకింగ్ కాలువకు తూర్పు ప్రాంతం మాత్రమే సర్వే జరిపి భూమిని సేకరిస్తామని చెప్పిన అధికారులు కోట మండలంలో కర్లపూడి, కాకోరిపాళెం, వేళ్ళపాళెం, చిల్లకూరు మండలంలో తూర్పు కనుపూరు పంచాయితీలోని ఈదలవారిపాళెం, కొమరావారిపాళెం, పోసినవారిపాళెం, రావలపాళెం, కనుపూరు గ్రామాలలో సెంటు భూమిని కూడా మిగల్చకుండా సర్వే జరిపినట్లు తెలిసింది. కనుపూరు గ్రామాల చుట్టు భూమని తీసుకొంటే గ్రామాలను మాత్రం ఖాళీ చేయించకుండా వుంటారా ? అన్న భయాన్ని ఆ గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

మామూలుగా ప్రతి పోర్టుకు ఇరు వైపుల 30 కి.మీ.ల తీరాన్ని దాని పరిధిగా నిర్ణయిస్తారు. అలాగే క్రిష్ణపట్నం పోర్టుకు ఇరు వైపులా 30 కి.మీ. తీర ప్రాంతాన్ని పరిధిగా నిర్ణయించారు. ఆ తరువాత తమ పోర్టు విస్తరణ ఇతర భవిష్యత్ అవసరాల కోసం పోర్టు పరిధిని విస్తరించాలని కె.పి.సి.యల్. ప్రభుత్వాన్ని కోరింది. కోరిందే తడవుగా ప్రభుత్వం ప్రకాశం జిల్లా వాడరేవుకు ఉత్తర భాగంలో 30 కి.మీ. పోను, క్రిష్ణపట్నం వరకు గల మొత్తం 85 కి.మీ.ల మేర తీరప్రాంతం మీద ప్రత్యేక హక్కులు కల్పిస్తూ పోర్టు పరిధిని విస్తరించింది. వాడరేవు నుంచి క్రిష్ణపట్నం వరకు తీరప్రాంతమంతా కె.పి.సి.యల్. ఆధీనంలోకి వచ్చింది. ఇక మత్స్యకారుల గ్రామాలు మత్స్యకారుల ఉపాధి, వారి బ్రతుకులు, సముద్రం మీద వేట ఇవన్నీ కలలే. భారీగా పెట్టుబడులు పెట్టిన కంపెనీలు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక హక్కులు కల్పించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మరి నిజమే కదా! ఒక మత్యకారుడు, ఒక పేద రైతు, ఒక రైతు కూలీ, అనేక చేతి వృత్తుల వాళ్ళు నష్టపోయినా, నాశనమయినా ఇబ్బంది లేదు. పాపం భారీగా పెట్టుబడులు పెట్టిన కంపెనీ నష్టపోతే ఎలా ? ఎంత ఉదారత కల్గిన ప్రభుత్వం ఇది. ఈ నిర్ణయంతో మత్యకారుల జీవనోపాధికి ప్రమాదం ఏర్పడింది. రేవుల పరిసరాల్లో చేపల వేట నిషేధం అమల్లో ఉంది. ఈ ప్రాంతమంతా చేపల వేటను నిషేధిస్తే తమ పరిస్థితి ఏంటని మత్యకారుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

**థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు :-**

దేశంలోనే అతి పెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పాదక కేంద్రంగా కృష్ణపట్నం ఆవిర్భవించనుంది. తొలి దశగా ఎ.పి.జెన్.కో నిర్మించ తలపెట్టినది. దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం. ఈ థర్మల్ విద్యుత్ కేంద్రం తొలి దశలో 1600ల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఉత్పత్తి కేంద్రంగా నిర్మాణం ప్రారంభించనుంది. ఏ.పి.జెన్.కో ఆధ్వర్యంలో నేలటూరు కేంద్రంగా దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 1350 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. సూపర్ క్రిటికల్ పరిజ్ఞానంతో దీనిని నిర్మించనున్నారు. తరువాతి దశలో మరో 2400 మెగావాట్ల ఉత్పత్తి స్థాయిని పెంచనున్నారు.

రిలయన్స్ కంపెనీ 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభించనున్నది. ఈ ప్రాజెక్టుకు 2625 ఎకరాల భూమిని కేటాయించారు. ఇవి కాక నవయుగ సంస్థ ఆధ్వర్యంలో 2000 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు, సింహపురి ఎనర్జీ సంస్థ 540 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు, మీనాక్షి సంస్థ 540 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు, కీనేటి సంస్థ 1080 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభించనున్నాయి.

ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి అయితే 12160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న థర్మల్ (బగ్గు ఆధారిత) విద్యుత్ 12381 మెగావాట్లు. రాష్ట్ర మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న థర్మల్ విద్యుత్‌కి ఇంచుమించు సమానంగా, ఒక కృష్ణపట్నంలోనే ఉత్పత్తి అవుతుంది. కృష్ణపట్నం పోర్టు, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు వీటి కోసం భూసేకరణ, మౌలిక సదుపాయాలు చకచకా పనులన్నీ జరిగిపోతున్నాయి. కానీ ఈ భూమి మీద ఆధారపడి జీవించే ప్రజల మాటేంటి ? వారి భవిష్యత్తు ప్రశ్నార్థకరంగా ఉంది.

మరి పర్యావరణం మాటేంటో ? ఇప్పటికే కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ఐరన్ ఓర్ రవాణా మరియు డంపింగ్‌ల వల్ల పర్యావరణం పూర్తిగా పాడవుతుంది. రవాణా జరిగే దారి పొడవునా ఐరన్ ఓర్ ధూళివలన పచ్చటి పొలాలు ఎర్రబారాయి. జల కాలుష్యం జరుగుతుంది. ఎడ తెరిపిలేని రవాణా కారణంగా అనేక ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. దీన్ని గురించి అనేక ప్రజా సంఘాలు ఆందోళన చేస్తూనే ఉన్నాయి. అయినా ప్రభుత్వం పట్టనట్టు ఉంది. ఉప్పు పరిశ్రమ కూడా దెబ్బతింటుంది.

ఇన్ని థర్మల్ పవర్ ప్రాజెక్టులకు అవసరమైన బగ్గును, ఇతర దేశాల నుంచి కూడా పెద్దఎత్తున దిగుమతి చేసుకోబడుతుంది. బగ్గు నిల్వలతో కృష్ణపట్నం నిండిపోతుంది. దిగుమతి చేసుకొనే బగ్గు రవాణా వలన సముద్ర జలాలు కలుషితమౌతాయి. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బగ్గు వలన కాలుష్యం, బూడిద పరిసర గ్రామాలని, పొలాలని, నీటి చెరువులను, సముద్ర జలాల్ని, భూగర్భ జలాలను సైతం కలుషితం చేస్తాయి. వాయు కాలుష్యం, జలకాలుష్యం, పర్యావరణ కాలుష్యం మొత్తం మీద కృష్ణపట్నం పరిసరాలన్నీ కాలుష్యంతో నిండిపోతాయి. పేద ప్రజలు సరియైన గాలి, నీరు, ఆహారం అందక రోగాల బారిన పడి తమ జీవితాలు చాలించాల్సి వస్తుంది. పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని అనేక విపరీత పరిణామాలు చవి చూడాల్సివస్తుంది.

ఇప్పటికే ఢిల్లీ ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు 19 రాష్ట్రాలలోని 200 జిల్లాలలో భూగర్భ జలాలు కలుషితం అయినట్లు కేంద్ర భూగర్భ జల సంస్థ తెలిపింది. ఈ ప్రాంతాల్లోని భూగర్భ జలాల్లో విషతుల్య పదార్థాలు, లవణీయత, ఫ్లోరైడ్, ఐరన్ శాతం అధికమైందని, ఈ జలాలు దీర్ఘకాలం వాడితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇది కాక చిల్లకూరు మండలంలోని చింతవరం కొత్తపాళెం గ్రామం వద్ద 714 ఎకరాల విస్తీర్ణంలో 600 కోట్లతో మాస్ హోల్డింగ్ వస్త్ర పరిశ్రమ, చిల్లకూరు మండలంలోని అంకుల పాటూరు గ్రామంలో 151 ఎకరాల విస్తీర్ణంలో 550 కోట్ల పెట్టుబడితో యస్.బి.క్యు ఉక్కు పరిశ్రమ, 5000 ఎకరాల విస్తీర్ణంలో మేనకూరులో టెక్స్‌టైల్ పార్కు, 999.15 ఎకరాల విస్తీర్ణంలో మంబట్టులో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు అవుతున్నాయి.

హక్కుల సంఘాలవారు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు అనే భావన ఒకటి ఉంది. హక్కుల సంఘాలు అభివృద్ధికి ఆటంకం కానే కాదు. కానీ పరిశ్రమలు స్థాపించబోయే ప్రదేశాన్ని అనుసరించి జీవించే బడుగుబలహీన సన్నచిన్నకారు రైతుల, సముద్రం తీరం వెంబడి జీవించే మత్యకారుల జీవితాలకు, జీవనోపాధికి, ప్రత్యాయ మార్గాలేమిటి అని, వారికి ఏవిధమైన పునరావాసం కల్పింస్తున్నారని వారు కోల్పోయిన దానికంటే ఎక్కువకాకపోయినా సమానంగానైనా వారికి నివాస, జీవనానికి సంబంధిచిన బరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని జ్ఞాపకం చేస్తాయి. ప్రజలు జీవించే హక్కుకు భంగం కలిగించ వద్దని కోరుతుంది.

**కోస్టల్ కారిడార్ :-**

ఇవి ఇలా ఉండగనే శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు గల తీర ప్రాంతాన్నంతటిని కోస్టల్ కారిడార్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెండు దశలుగా నిర్మాణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. తీర ప్రాంతం అభివృద్ధి పేరుతొ ప్రభుత్వం కోస్టల్ కారిడార్ నిర్మాణానికి తే.04-01-2008న జి.ఓ. నెం. 34ను జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో తీర ప్రాంతాన్ని కోస్టల్ కారిడార్‌గా ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశ అభివృద్ధిలో భాగంగా తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల మధ్యగల 603 చ.కి.మీ విస్తీర్ణాన్ని పెట్రో కెమికల్ రీజన్‌గా అభివృద్ధ చేయాలని నిర్ణయించింది. మొత్తం ఒక్కలక్షా యాభైవేల ఎకరాల మేర రీజన్‌ను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెట్రో కెమికల్ కారిడార్‌గా, ఇండస్ట్రియల్ కారిడార్‌గా మొదటి దశలో అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కులు, థీమ్ పార్కులు, కెమికల్ కాంప్లెక్సులు, గ్యాస్ ఆధారిత

విధ్యుత్ పరిశ్రమలు, పవర్ ప్లాంట్లు, ఫార్మా పార్కులు నిర్మించనున్నారు. రెండవ దశలో మిగిలిన జిల్లాల నుంచి 972 చ.కి.మీ.లో కోస్టల్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇప్పటికే సెజ్‌ల పేర్లతో కోస్తా తీర ప్రాంతంలో వేలాది ఎకరాలు భూములు సేకరించగా, తాజాగా కోస్టల్ కారిడార్ పేరుతో, అభివృద్ధి పేరుతో భారీగా భూములు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

విశాఖ- కాకినాడ తీర ప్రాంతం భౌగోళికంగా పరిశ్రమల స్థాపనకు మంచి అనువుగా ఉండంతో, ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావడంతో పాటు, పెద్ద ఎత్తున భూసేకరణ జరిపి అడిగినంత భూములు కేటాయిస్తుండడంతో, బడా పారిశ్రామిక వేత్తలలో ఉత్సాహం వ్యక్త మౌతుంది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన పలు కంపెనీలతో పాటు బహుళ జాతి సంస్థలు కూడా పరిశ్రమల స్థాపనకు పోటీ పడుతున్నాయి. అడిగినంత భూమి సేకరించి ఇవ్వడం, మౌలిక సదుపాయల కల్పన, నిబంధనల సడలింపులు, అనేక విధములైన రాయితీలు ఇలా ఎన్నో వెసులుబాట్లు ప్రభుత్వం వీరికి కల్పిస్తుంది. వాడరేవు – నిజాం పట్నం పోర్టుల పారిశ్రామిక కారిడార్ "వాన్‌పిక్"కు భూములు సేకరించేది లేదని మెజార్టీ గ్రామ పంచాయితీలు ఖరాఖండిగా తేల్చిచెప్పాయి. ఈ మేరకు తీర్మానాలు చేశాయి. చాలా వరకు పంచాయితీలు అసలు సమావేశాలు నిర్వహించేందుకే ఆసక్తి చూపలేదు. కానీ ప్రభుత్వం మాత్రం ఎకరం భూమి విలువ నిర్ణయించింది. మార్కెట్ ధరను తేల్చి చెప్పింది. ఉన్నత స్థాయి కమిటీ ధరను సిఫారసు చేసింది.

గుంటూరు జిల్లాలో 5451.06 ఎకరాల పట్టా భూమి, ప్రకాశం జిల్లాలో 6493.19 ఎకరాల పట్టాభూమి "వాన్‌పిక్" కోసం సేకరించాలని నిర్ణయించింది. దీనికి 08-09-2008న మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. ఆగష్టు 28, 30 తేదీలలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, సి.సి.యల్.ఎ, ఛీఫ్ కమీషనర్ డి.కె. పన్వర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ హైదరాబాదులో సమావేశమైనది. ఈ సమావేశానికి ఆయా జిల్లాల కలెక్టర్లు సంయుక్త కలెక్టర్‌లు వేర్వేరుగా హజరైనారు. ఈ సమావేశంలోని మినిట్స్‌లో నమోదైన వివరాల ప్రకారం కోస్టల్ కారిడార్ "వాన్‌పిక్" కి భూమిని సేకరించడానికి వీలులేదని గుంటూరు జిల్లాలోని పేరలి, అడవుల దీవి, దిండి గ్రామ పంచాయితీలు తీర్మానం ద్వారా తేల్చి చెప్పాయి. పల్లెపాలెం, అడవి, అల్లూరు పంచాయితీల నుండి తీర్మానాలు ప్రభుత్వానికి అందలేదు. రాష్ట్ర మౌలిక సౌకర్యాలు, పెట్టుబడులు, విమానయాన, ఓడరేవుల శాఖా మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత మండలంలోనే కోస్టల్ కారిడార్‌కు భూసేకరణ పట్ల వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమయింది. ఆయన స్వగ్రామమైన నిజాం పట్నంలో 1651.14 ఎకరాలు అసైడ్ భూమి లబ్ధిదారుల దగ్గర ఉందని, దాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో పొందుపరచారు. నిజాంపట్నం గ్రామంలో 32.60 ఎకరాల డొంక, కాలువల పొరంబోకుగా చూపారు. ఆ భూమిని సేకరించడానికి వీల్లేదని పొందుపరచడం విశేషం. ఉన్నత స్థాయి కమిటీ ఇక్కడ కనిష్ట ధర 1.18 లక్షల నుంచి 1.68 లక్షలుగా తేల్చి ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

బాపట్ల మండలం అడవి గ్రామంలో ఎకరా మూల విలువ, మార్కెట్ విలువ 82000/- ఉందని ఈ భూమికి ఎకరాకు 1.18 లక్షల వరకు ఇవ్వవచ్చని ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు చేసింది. ఈ గ్రామం నుంచి 285.62 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది.

కర్లపాలెం మండలం పేరలిలో ఎకరం 90000/- గా చూపింది. ఈ భూమికి 1.29 లక్షలు ఇవ్వవచ్చని సిఫారసు చేసింది. ఈ గ్రామంలో 407.59 ఎకరాలు సేకరించాలని నిర్ణయం.

పిట్టలవాని పాలెం మండలంలోని అల్లూరు లో 285.02 ఎకరాలు, నిజాం పట్నంలో 1683.74 ఎకరాలు అడవుల దీవి గ్రామంలో 794.93 ఎకరాలు, దిండిలో 1386.95 ఎకరాలు, పల్లెపాలెంలో 607.16 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. ఇక్కడ ఎకరం మూల, మార్కెట్ విలువ 1.17 లక్షలుగా పేర్కొంది. ఉన్నత స్థాయి కమిటీ మాత్రం ఎకరానికి 1.68 లక్షలు ఇవ్వవచ్చని సిఫారసు చేసింది.

ప్రకాశం జిల్లాలో 'వాన్‌పిక్' కోసం 6493.19 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. ఆయా గ్రామ పంచాయితీలు మాత్రం భూసేకరణ జరపడానికి వీల్లేదని నిర్ణయించాయి. మోటుపల్లి, నాయునిపల్లి, అల్లూరు, పుల్లురు పాలెం పంచాయితీలు భూసేకరణను వ్యతిరేకించినట్లు ఉన్నత స్థాయి భేటీలోని మినిట్స్‌లో పొందు పరచడం గమనార్హం. పెద్ద పల్లె పాలెం, ఉలిచి పంచాయితీలు సమావేశాలు నిర్వహించడానికి పూనుకోలేదు.

ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని తొలుత వాడరేవు-నిజాం పట్నం పోర్టుల పారిశ్రామిక కారిడార్ "వాన్‌పిక్"లో భాగం చేయాలని అనుకున్నారు. అయితే ఈ ప్రాజెక్టు ఎ.పి.జెన్.కో కు అప్పగించాలని నిర్ణయించడంతో అదనంగా 4 వేల ఎకరాల భూసేకరణకు సన్నాహాలు మొదలయ్యాయి

వాడరేవుకు 4 కి.మీ. దూరంలో దీనికి స్థలం కేటాయించాలని నిర్ణయించడంతో చినగంజాం, నాగులుప్పలపాడు మండలాల మధ్య ఇది వచ్చే అవకాశం ఉంది. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు వద్ద 1000 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నట్లు ఇప్పటికే రెవిన్యూ అధికారులు గుర్తించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలో కలిపి "వాన్‌పిక్"కు 28 వేల ఎకరాలు సేకరించాలని తొలుత నిర్ణయించారు. ఆమేరకు రెండు జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ ప్రజల నుండి వ్యతిరేకత రావడం వలన రెండు జిల్లాల్ల కలిపి 19 వేల ఎకరాలు మాత్రమే "వాన్‌పిక్"కు తీసుకుంటున్నామని సంబంధిత మంత్రి శ్రీ మోపిదేవి వెంకటరమణరావు గారు ప్రకటించారు. ప్రకాశం జిల్లాలో కొత్తపట్నం, ఒంగోలు, చినగంజాం, వేటపాలెం మొత్తం నాలుగు మండలాలలో కలిపి అసైన్డ్ భూమి 6406 ఎకరాలు, పట్టా భూమి 3401 ఎకరాలు వెరశి 10000 ఎకరాలను వాన్‌పిక్‌కు కేటాయించారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాలలో ఉన్న భూములను ఐ.టి. పార్కు, పర్యాటక కేంద్రం, విమానాశ్రయాలకు ఇస్తున్నారు. ఇక మిగిలినది 4814 ఎకరాలు. దీనిలో 2 వేల ఎకరాలు ఓడరేవుకు మరో 2 వేల ఎకరాలు నౌకా నిర్మాణ యూనిట్‌కు కేటాయించారు.

## మెగా ఫుడ్‌పార్క్ :

ఇదిలా ఉండగనే మెగా ఫుడ్ పార్కు (భారీ ఆహార మండలి) కి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా 10 మెగా ఫుడ్ పార్కుల ఏర్పాటుకు ఆమోదించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు ఉన్నాయి. భారీ ఆహార మండలి ఏర్పాటుకు సంబంధించిన యోగ్యతా పత్రాలను ఇప్పటికే చిత్తూరు ఆహార మండలి సాధించింది. ఒక్కో ఆహార మండలి ఏర్పాటుకు 500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈ నిధులతో అత్యాధునిక యంత్ర సామాగ్రితో మౌలిక సదుపాయాలు కల్పించి ఆహారోత్పత్తులను శుద్ధి చేస్తారు. కంపెనీల చట్టంప్రకారం "స్పెషల్ పర్పస్ వెహికల్"గా ఈ మండళ్ళు ఏర్పాటు చేస్తారు. ఈ మండలిలో ఆహార హబ్‌లు, పరిశోధన శాలలు, శీతలీకరణ గిడ్డంగులు, ప్యాకేజి యూనిట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రయివేటు పెట్టుబడి దారులను ఆహ్వానిస్తారు. మరి వీటి పేరుతో ఎంతభూమి సేకరిస్తారో ఇంకా తెలియరాలేదు.

ఇవి కాక రాష్ట్రంలో మరో 6 ప్రత్యేక ఆర్థిక మండళ్ళు రాబోతున్నాయి. రంగారెడ్డి జిల్లా షామీర్ పేట మండలం, కోల్తూరు గ్రామంలో 10.21 హెక్టార్లలో బయోటెక్నాలజీ ప్రత్యేక ఆర్థిక మండలిని, బయలాజికల్ ఇ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పటు అవుతుంది.

నల్గండ జిల్లా భువనగిరిలో 101.17 హెక్టార్లలో లైట్ ఇంజనీరింగ్ సెజ్‌ను దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాంగ్ హోల్డింగ్ లిమిటెడ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతుంది. రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం, గూడూరు గ్రామంలో 10.12 హెక్టార్లల్లో ఎలక్ట్రానిక్ హార్డ్ వేర్‌సెజ్‌ను యస్.2 టెక్ కామ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది.

రంగారెడ్డి జిల్లా శంకరంపల్లి మండల కేంద్రంలో 10 హెక్టార్లలో బయోటెక్నాలజీ సెజ్‌ను లాహరి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది. మెదక్ జిల్లా పఠాన్‌చెరులో 13.76 హెక్టారులలో ఐ.టి. సెజ్‌ను గోద్రేజ్ రియల్ ఎస్టేట్ ప్రయివేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది.

రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ మండలం గగన్‌పహాడ్ గ్రామంలో 1.28 హెక్టారులలో ఐ.టి. సెజ్‌ను మధుశీల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ ప్రయివేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది.

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి నెల్లూరు జిల్లా తడ వరకు 1500 కి.మీ కోస్తా కారిడార్ ఏర్పాటు, దానికోసం సుమారు 10 నుంచి 15 లక్షల ఎకరాల భూములను సేకరించాలని ఉత్తర్వులు జారీచేశారు. తే 11.02.08దిన కోస్తా కారిడార్‌పై కేంద్ర ప్రభుత్వం జి.ఓ నెం. 34ను విడుదల చేసింది. తే 26.06.2008దిన విశాఖ పట్నంలోని కాకినాడ వరకు ప్రత్యేక ఆర్థిక మండలి అంటూ ఓ నోటిఫికేషన్ ఇచ్చారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు 110 రెవిన్యూ గ్రామాలలో మొదటి దశలో 1.5 లక్షల ఎకరాలను సేకరించాలని ఇందులో ఇప్పటికే 51505 ఎకరాలను సేకరించి రైతులనుండి స్వాధీనం చేసుకొంటూ తే24-05 -2008ది జి.ఓ. నెం. 913 జారీచేశారు.

పేదల భూములను రకరకాల పద్దతులలో స్వాధీనం చేసుకొంటున్న ప్రభుత్వం తాజాగా "ప్రజా ప్రయోజనం" పేరిటి వారి సాగుభూముల్ని లాక్కునే ఎత్తుగడ అమలు చేయదలచింది. ఇందుకోసం పాత ఉత్తర్వు నొకదానికి విస్తృత పరిచింది.

అసైన్డ్ సవరణ చట్టం క్రింద ఆయా ప్రాంతాలను నోటిఫై చేసి అక్కడ అన్యాక్రాంతమైన భూములను నేరుగా తీసుకోవడం మొదటి పద్ధతి. భూములపై కన్నేసిన సంస్థలు ఆయా లబ్దిదారులతో సంతకాలు చేయించి లేఖలు తెస్తే, భూములను అటువంటి సంస్థలకు ఇచ్చివేయడం రెండవ పద్దతి. "ప్రజా ప్రయోజనం" పేరుతో సాగు భూముల్ని తీసుకొనేటప్పుడు దానికి ప్రభుత్వ విలువ ఎంత ఉంటే ఆ మేరకు లెక్క కట్టి పేదలకు చెల్లించి భూములు స్వాధీనపరచు కోవడం మూడవ పద్దతి. ప్రజా ప్రయోజనానికి అవసరం అనుకుంటే భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది అంటూ భూమిని పంపిణీ చేసేటప్పుడు లబ్ధిదారులకిచ్చే 'డి' పట్టాలో ఇటువంటి నిబంధన ఉన్నా, దీనికి అనుగుణంగా భూమిని స్వాధీనపర్చుకున్న సందర్భాలు చాలా అరుదు. ఎందుకంటే ఆయా భూములలో పేదలు పంటలు పండించుకుంటూ ఉంటారు. ప్రభుత్వం ఇప్పుడు ఆ సాగుభూములు తీసుకోవడానికి 'డి' పట్టాలోని ఈ నిబంధనను విస్తృతంగా ఉపయోగించదలచింది.

ఈ భూములను లబ్దిదారులు రాత్రింబవళ్ళు కష్టపడి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగుకు అనుకూలంగా మార్చుకొని ఉంటారు. కాబట్టి వారికి మౌలిక విలువ చెల్లించడం సమంజసం అంటూ దాదాపు అయిదేళ్ళ క్రితం 1307 నెంబరుతో ఓ ఉత్తర్వు వెలువడింది. దీనిని ఇప్పుడు వివిధ ప్రాంతాలలో ఉ పయోగించనున్నారు. వాడరేవు, నిజాంపట్నం, నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్‌కు భూముల కోసం ఈ 1307 ఉత్తర్వును అమలు చేయనున్నారు.

ఇప్పటి వరకు సిరులు పండించిన పొలాలు ప్రత్యేక ఆర్థిక మండలుల రాకతో పచ్చదనం కోల్పోయాయి. పరిశ్రమల స్థాపన అనే సాకుతో వేల వేల ఎకరాలు బడా బాబుల పరమౌతున్నాయి. పరిశ్రమల స్థాపనకు వేల వేల ఎకరాలు భూములు అవసరమా? ఇలా వేలకు వేల ఎకరాల, భూములు సేకరించడంతో, వీటిపై ఆధారపడిన రైతులు, రైతు కూలీలు, అనేక చేతి వృత్తులవారు, తీరప్రాంత మత్యకారులు, భూములు కోల్పోయి, నివాస గ్రామాలు కోల్పోయి, దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. జీవనోపాధిని, నివాసాల్ని సైతం కోల్పోయిన వీరి జీవనం పరిహాసంగా మారింది.

ఈ విధంగా ఇబ్బడిముబ్బడిగా వేలకు వేల ఎకరాలు భూములు సేకరిస్తూనే కోస్తా కారిడార్‌కు సంబంధించి ప్రయివేటు భూమిని ఒక్క ఎకరం కూడా సేకరించలేదని ఇచ్ఛాపురం నుండి తడ వరకు రోడ్డు మార్గం వేసి అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలు వద్దంటే కోస్తా కారిడార్ నిలిపివేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారు, రాష్ట్ర మౌలిక సదుపాయల శాఖామాత్యులు శ్రీ మోపిదేవి వెంకటరమణరావు గారు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది.

కోస్తాకారిడార్ పై తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో జి.ఓ. నెం. 34ను ప్రభుత్వం రద్దుచేసింది, 08.11.2008 న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. వెనుక బడిన తీరప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో తాము జి.ఓ. నెం.34 ను తీసుకొచ్చామని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తీరప్రాంత ప్రజలను కాపాడేందుకు జాతీయ రహదారులకు సమాంతరంగా తీరప్రాంతంలో రహదారుల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయడానికి, కోస్తాప్రాంతాల అభివృద్ధికి ఎక్స్‌ప్రెస్ వే తరహాలో రోడ్లనిర్మాణం చేపట్టడానికి మాత్రమే జి.ఓ. నెం. 34ను జారీ చేసినట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖామంత్రి శ్రీ మోపిదేవి వెంకటరమణరావు గారు ప్రకటించారు.

అయితే కోస్తాకారిడార్‌లో పరిశ్రమలకోసం పెద్దఎత్తున భూములు సేకరిస్తారని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అందువలన ప్రజలు భయభ్రాంతులకు గురై, నిరసనలకు , ఆందోళనలకు దిగిన కారణంగా జి.ఓ.నెం 34 ను రద్దుచేయవలసి వచ్చిందని, ఈ కారిడార్ ఇంకా అధ్యయన దశలోనే వుందని, ప్రజలు అపోహలు తొలగించేందుకే ఈ ఉత్తర్వును రద్దుచేశామని రాష్ట్ర మంత్రి శ్రీ మోపిదేని వెంకట రమణారావుగారు ప్రకటించారు. ఇది నిజమేనా ?

మరైతే పి.సి.పి.ఐ.ఆర్ కోసం ప్రత్యేక అభివృద్ధి సంస్థ (సి.యస్.డి.ఎ) ను ఏర్పాటు చేసిన జి.ఓ.నెం 373 కూడా రద్దుచేయాలి 24.05.2008న జారీచేసిన జి.ఓ.నెం. 913ను రద్దుచేసి రైతుల నుండి సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇస్తారా ? కాకినాడ సెజ్ కోసం సేకరించిన 10,500ల ఎకరాలు, ప్రకాశం గుంటూరు జిల్లాలో వాన్‌పిక్ కోసం సేకరించిన 28,000 ఎకరాలు నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక పార్కుకోసం కోట, చిల్లకూరు మండలాలో సేకరించిన 5,265 ఎకరాల భూమిని, వివిధ ప్రాజెక్టులకు, వివిధ కంపెనీలకు కేటాయించిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములను, లబ్దదారులనుండి సేకరించిన అసైన్డ్ భూముల్ని తిరిగి ఆయా రైతులకు స్వాధీనం చేస్తారా ?

ప్రభుత్వం అభివృద్ధి పేరున చేపట్టిన పథకాలు సాదారణ ప్రజల జీవనోపాధికి, జీవించే హక్కుకు భంగం కలిగించకూడదు. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, పోర్టులు , పారిశ్రామిక వాడలు టెక్స్‌టైల్ పార్కులు పెట్రోకెమికల్ కారిడార్‌లు, థీమ్‌పార్కులు, కెమికల్ కాంప్లెక్స్‌లు, పార్మపార్కులు, లెథర్‌పార్కులు, కోష్టల్ కారిడార్ మొదలైనవన్నీ కూడా పెత్తందారులకు బడాబాబులకు ప్రయోజనం కల్గించేవే. పెద్దల ప్రయోజనం కొరకు వారి అభివృద్ధి కొరకు తీరప్రాంత ప్రజల జీవనోపాధికి, నివాసానికి, జీవించే హక్కుకు గండి కొట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థలో తగదు. కాబట్టి ప్రజల ఎడల ప్రభుత్వం యొక్క బాధ్యతను గుర్తుచేస్తూ, కోస్తా కారిడార్‌ని వ్యతిరేకిద్దాం ! రండి.

**మానవ హక్కుల వేదిక**
Human Rights Forum (HRF)
**శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కమిటి,**

తేది : 14-11-2008